6 వరకు 144 సెక్షన్ పొడిగింపు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అంటే జూన్ ఆరో తేదీ వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం కొన్ని ప్రాంతాల్లో శాంతిభద్రతలకు అవాంతరం కలిగే అవకాశం ఉన్నందున 144 సెక్షన్‌ను జిల్లాలో జూన్ 6వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. జిల్లాలో 144 అమలు నేపథ్యంలో చట్టవిరుద్ధ సమావేశాలు, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించడం నిషేధమని పేర్కొన్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా, ఐదుగురు కంటే ఎక్కువగా ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు పదునైన ఆయుధాలు, తుపాకీలు, కర్రలు, రాళ్లు వంటివి వెంట తీసుకువెళ్లడం, ప్రదర్శించడం నిషేధమని ఆయన స్పష్టం చేశారు.

పందేల జోరు.. నేతలే నిర్వాహకులు..!

కౌంటింగ్ నాటికి రూ.వందల కోట్లు దాటే ఛాన్స్

ప్రజాశక్తి - కాళ్ల

పోలింగ్ ముగిసింది. కౌంటింగ్ మిగిలింది. ఈ నేపథ్యంలో పందేల జోరు మరింత ఊపందుకుంది. బెట్టింగ్‌రాయుళ్లు ఫలానా అభ్యర్థి గెలుస్తాడని, ఫలానా అభ్యర్థికి ఇన్ని ఓట్లు వస్తాయని, ఇంత మెజార్టీ వస్తుందని, ఫలానా పార్టీకి ఇన్ని ఓట్లు వస్తాయని ఇలా రకరకాలుగా బెట్టింగులు సాగుతుండటం విశేషం.

ఉండి అసెంబ్లీ స్థానంలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయనే అంశం మొదలుకుని కీలకమైన అభ్యర్థులు సాధించే మెజార్టీల వరకు అన్నింటిపైనా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. వేలల్లో, లక్షల్లో పందేలు సాగుతుండటం విశేషం. ఉండి నియోజకవర్గంలో టిడిపి కూటమి, వైసిపి అభ్యర్థుల విజయావకాశాలపై బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. దీంతో ప్రధాన పార్టీల, అభ్యర్థుల గెలుపోటములను విశ్లేషించేందుకు ఆయా పార్టీలవారీగా రాజకీయ నిపుణులు రంగంలోకి దిగారు. వీరు బూత్‌లవారీగా పోలైన ఓట్ల వివరాలు, వాటిలో యువత ఎంతమంది, మహిళలు ఎంత మంది అనే వివరాలు సేకరించి పార్టీలకు ఓట్లు ఎలా పడి ఉంటాయని అంచనాకు వస్తున్నారు. ఆయా బూత్‌ల్లో పార్టీలకు ఉన్న పట్టును కూడా పరిగణనలోకి తీసుకుని గెలుపోటములను అంచనా వేస్తున్నారు. బూత్‌లవారీగా లెక్కలు వేసుకుని ఒక అంచనాకు వచ్చిన తర్వాత బెట్టింగ్ కోసం సమాచారాన్ని పంపుతున్నారు. బెట్టింగ్ బాబుల్లో అధికశాతం ఈసారి ప్రధాన పార్టీల ద్వితీయశ్రేణి నాయకులే ఉండటం గమనార్హం. నియోజకవర్గ స్థాయిలో ఆయా పార్టీల్లో ముఖ్య నేతలుగా ఉన్నవారు కూడా బెట్టింగ్ నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు. కేవలం ఉండిలో టిడిపి కూటమి, వైసిపికి చెందిన సుమారు వంద మందికిపైగా నేతలు బెట్టింగ్ వ్యవహారాలకు కేంద్రంగా మారడం గమనార్హం.

మధ్యవర్తులకు డబ్బే డబ్బు

ఈసారి బెట్టింగ్ కాసేవారు పక్కాగా వ్యవహరిస్తున్నారు. బెట్టింగ్‌కు ముందుకొచ్చిన వారు ముందుగా ఓ ఒప్పంద పత్రం రాసుకుంటున్నారు. ఇద్దరూ కలిసి ఒక నమ్మకమైన వ్యక్తి దగ్గర బెట్టింగ్ మొత్తాన్ని ఉంచుతున్నారు. ఫలితం తేలిన తర్వాత ఆ వ్యక్తి ఒప్పందం ఆధారంగా నగదును ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మధ్యవర్తులుగా ఉన్నవారికి భారీగానే గిట్టుబాటవుతోంది. పందెం మొత్తంలో 5 నుంచి 10 శాతం కమీషన్ రూపేణా మధ్యవర్తులకు అందజేయాలని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఉండి నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు రూ.100 కోట్ల మేర బెట్టింగులు జరిగినట్లు అంచనా. ఫలితాలు వెలువడే నాటికి ఈ బెట్టింగులు రెట్టింపయ్యే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

బెట్టింగుల జోరు..

నరసాపురం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో బెట్టింగుల జోరు పెరిగింది. నరసాపురం టిక్కెట్ ఎవరికిస్తారనే దానిపై ఓ పార్టీలో పెద్దఎత్తున బెట్టింగులు సాగాయి. ఆ టిక్కెట్ విషయం తారుమారు కావడంతో చాలామంది దెబ్బతిన్నారు. తాజాగా పోలింగ్ ముందు నుంచి బరిలో ఉన్న అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగులు సాగుతున్నాయి. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది, నరసాపురంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుపొందుతారు, ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి, ఎంత మెజార్టీ వస్తుంది, పవన్ పోటీలో ఉన్న పిఠాపురంలో ఎంత మెజార్టీ వస్తుందనే దానిపై పందేలు సాగుతున్నాయి. ఇప్పటికే చాలామంది బాండ్ పేపర్లపై, పెద్ద మనుషుల సమక్షంలో అగ్రిమెంట్‌లు రాసుకుంటున్నారు. జూన్ 4న లోపు బెట్టింగులు మరింత పెద్దఎత్తున సాగే అవకాశం ఉందని తెలుస్తోంది.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లను జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇవిఎం స్ట్రాంగ్ రూముల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఉద్యోగులు అలసత్వం వహించకుండా అప్రమత్తతో ఉండాలరన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్‌పితోపాటు డిటిసి డిఎస్‌పి కె.ప్రభాకర్‌రావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, త్రీటౌన్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఏలూరు సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.మురళీకృష్ణ, పోలీస్ అధికారులు ఉన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ తనిఖీ చేసి రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎస్‌పి మేరీప్రశాంతి

నేటి నుంచి గురుకులాల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్

ప్రజాశక్తి - భీమడోలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి సన్నాహాలు పూర్తి చేసినట్లు జిల్లా సమన్వయకర్త ఎన్.భారతి తెలిపారు. దీనిలో భాగంగా 16, 17 తేదీల్లో పొలసానిపల్లి బాలికల గురుకుల జూనియర్ కళాశాల వేదికగా కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో ర్యాంకులు సాధించిన వారికి ఆన్‌లైన్ విధానంలో సీట్ల కేటాయింపు జరిగిందన్నారు. ఇంకా బాలుర విభాగంలో మిగిలిన 140 సీట్లు భర్తీ కావాల్సి ఉందన్నారు. ఇక బాలికల విభాగం కింద 122 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నామన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యేవారు గతంలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష హాల్ టికెట్, ర్యాంకు కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు పదో తరగతి మార్కులు షీటు, ఆధార్ కార్డుతో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో బాలురకు ప్రత్యేకించిన పెదవేగి, ఆరుగొలను, నరసాపురం జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 16న, బాలికలకు ప్రత్యేకించిన పొలసానిపల్లి, వట్లూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, నూజివీడు జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 17న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కౌన్సెలింగ్ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని జిల్లా సమన్వయకర్త తెలిపారు.

కావూరి లావణ్య ఆరోపణలు నిరాధారం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ఎంపీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన కావూరి లావణ్య తనపై చేసిన ఆరోపణలు నిరాధారమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఖండించారు. బుధవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన అసెంబ్లీ అభ్యర్థులపై నిందారోపణలు చేయడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల ప్రకారం అందర్నీ కలుపుకుని ప్రచారం సాగించామన్నారు. అభ్యర్థులు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారని, ఎవరూ సహకరించలేదని ఆరోపణ చేయడం అవాస్తవమని తెలిపారు. ఆమె వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అయితే ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నియోజకవర్గంలోకి వచ్చి తనకు సహకరించలేదని చెప్పడం విడ్డూరమన్నారు. దెందులూరు నియోజకవర్గ అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి మాట్లాడుతూ తనకు రూ.కోటి ఇస్తే ఎంఎల్‌ఎ టిక్కెట్ ఇప్పిస్తానని ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య బేరసారాలు చేశారని ఆరోపించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులపై ఆమె ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేయడం తగదని, పార్టీ ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పిసిసి అధ్యక్షురాలు షర్మిలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో ఎటువంటి అనుభవం లేకుండా నాలుగు నెలల ముందు వచ్చి 30 ఏళ్ల అనుభవాన్ని ప్రశ్నించడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామని నరసింహమూర్తి అన్నారు. ఈ సమావేశంలో చింతలపూడి సిట్టింగ్ ఎంఎల్‌ఎ, కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా, ఉంగుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి హరికుమార్‌రాజు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు, పక్కనే ఎలిజా, కాంగ్రెస్ అభ్యర్థులు

తొలివిడత మలాథియన్ పిచికారీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో మొదటి విడతగా దోమల నివారణకు మలాథియన్ పిచికారీ ప్రారంభించినట్లు బుట్టాయగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వి.పెద్దిరాజు తెలిపారు. బుధవారం మొదటి రోజు జీలుగుమిల్లి పిహెచ్‌సి పరిధిలో ఏజెన్సీ గ్రామాలైన బర్రింకలపాడు, జీలుగుమిల్లి, మధ్య బర్రింకలపాడు గ్రామాల్లో మలాథియాన్ పిచికారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఇంటి ఆవరణలో కుండీల్లో నీటి నిల్వలు లేకుండా, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు ఇళ్లలో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమ తెరలను వాడాలని కోరారు. ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి.నాగరత్నం, హెల్త్ అసిస్టెంట్లు ప్రసాద్, రవీంద్ర, బాలాజీ, ఎఎన్‌ఎం ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: ఇంట్లో మలాథియన్ స్ప్రే

పోలవరం: దోమల మందు పిచికారీకి సహకరించి, మలేరియా నివారణకు తోడ్పడాలని జిల్లా మలేరియా అధికారి సురేష్ కోరారు. బుధవారం పోలవరం మండలం జిల్లెళ్లగూడెం పంచాయతీ పాతకుంకాల, మనుగోపల గ్రామాల్లో ఎంపిహెచ్‌వి బొంగు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తొలి విడత దోమల మందు మలాథియాన్ పిచికారీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి సురేష్ ఆ గ్రామాల్లో మలాథియన్ పిచికారీపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కుంకాల గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో దోమల మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఎల్‌ఎన్‌డి పేట వైద్యాధికారి నిఖిల్, వైద్య సిబ్బంది శ్రీను, రామరాజు, జె.ప్రసాద్, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పోలవరం: అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి సురేష్

సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

సిఐటియు జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని సిఐటియు ఏలూరు జిల్లా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక సమావేశంలో పాల్గొన్నారనే కారణంతో ఒక పత్రికలో వచ్చిన వార్తను సాకుగా చూపి ఎన్నికల నియమావళి ఉల్లంఘించారనే పేరుతో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ అధికారులు సస్పెండ్ చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల సమావేశంలో పాల్గొనడం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పరిధిలోకి రాదని, అయినా యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని విమర్శించారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులకు ఓటు వేయమని ప్రేరేపించడం, రాజకీయ పార్టీల తరఫున ప్రచారం చేయడం తదితర అంశాలు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. అటువంటి అభియోగాలు ఏమీ లేకుండా దురుద్దేశపూర్వకంగా జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ అధికారులు సుందరయ్యను అక్రమంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎటువంటి ఆదేశాలూ ఇవ్వక పోయినా కుట్ర పన్ని ఇటువంటి చర్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు జిల్లా అధికారులు చేసిన తప్పుడు సస్పెన్షన్‌పై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అధికారులు చేసిన అక్రమ సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకొని సస్పెన్షన్ ఎత్తివేసి సుందరయ్యను విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఓటర్లకు కృతజ్ఞతలు : బండి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎండను లెక్క చేయకుండా అర్ధరాత్రి వరకూ క్యూలో నిలబడి ఓటు వేసిన ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లకు సిపిఐ ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో తనకు ఓటేసిన ప్రజలకు, శ్రేయోభిలాషులకు ఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రత్యేకించి రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజల తరుపున నిరంతరాయంగా పని చేసిన ప్రజా సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్యతో పాటు సిపిఐ శ్రేణులు, రోడ్డు షోలో పాల్గొని ఓటర్లను చైతన్యవంతం చేసి, తనకు ఓట్లు పడేవిధంగా కృషి చేసినందుకు ధన్యవాదాలన్నారు. ఎన్నికల ప్రచారంలో అహోరాత్రులు పని చేశారని వారికి ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలుపుకుంటున్నానని చెప్పారు. వివిధ రూపాల్లో మద్దతిచ్చిన సిపిఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, భారత్ బచావో పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. లౌకికతత్వ పరిరక్షణ కోసం ఎన్నికల్లో పనిచేసిన వివిధ ప్రజా సంఘాలు ప్రత్యేకించి చైతన్య వేదిక, రాజ్యాంగం పరిరక్షణ వేదిక, కార్మిక, రైతు, యువజన, విద్యార్థి, మహిళ, సామాజిక రంగాలకు, తనకు మద్దతు ఇచ్చిన ఇతర సంఘాల నాయకులకు, సోషల్ మీడియా, జర్నలిస్టులకు ధనవ్యాదాలు తెలిపారు. ఎన్నికల్లో తీర్పు ఎలా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజల తరుపున సిపిఐ నిరంతరాయంగా నిలబడి భవిష్యత్తులో కూడా పోరాడుతుందని తెలిపారు.

కలెక్టర్‌కు 'మానవత' అభినందనలు

పోలింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించారని ప్రశంస

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగిన సందర్భంగా మానవత ఏలూరు యూనిట్ వారు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్‌ను కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రారంభం నుంచి జిల్లా అంతటా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తూ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రభుత్వ అధికారులకు ఎన్నికల నిర్వహణ అంశాలపై మార్గదర్శకాలను ఇస్తూ పోలింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, పొరపాట్లు జరుగకుండా తగు జాగ్రత్తతో మంచి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల సజావుగా నిర్వహిం చినందుకు జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ వారికి మానవత ఏలూరు యూనిట్ వారు అభినం దనలు తెలుపుతున్నట్లు చెప్పారు. అభినందనలు తెలిపిన వారిలో మానవత ఏలూరు యూనిట్ రీజనల్ ఛైర్మన్ పోలవరపు దేవ రత్నాకరరావు, యూనిట్ ఛైర్‌పర్సన్ అడుగుమిల్లి నిర్మల, సభ్యులు అల్లూరి మోహిని, మేడికొండ పద్మజ, డి.భారతి, వై.విష్ణు ఉన్నారు.

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను అభినందిస్తున్న మానవత ఏలూరు యూనిట్

జ్ఞాపిక టివిఎస్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరంలోని శాంతినగర్‌లో జ్ఞాపిక టివిఎస్ షోరూమ్‌ను నేషనల్ టివిఎస్ సేల్స్ మేనేజర్ కులదీప్‌శర్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కులదీప్‌శర్మ మాట్లాడుతూ టివిఎస్ అనేది ఒక మంచి బ్రాండ్ అని, ఇందులో చాలా కొత్త కొత్త మోడల్స్ వచ్చాయని, ఏలూరు ప్రజలు ఒకసారైనా విజిట్ చేసి కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం ఏరియా మేనేజర్ శివ భరద్వాజ్ మాట్లాడుతూ ఏలూరులో ఇది నాలుగో షోరూమ్ అని, దీనిని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. సేల్స్, స్పేర్ పార్ట్స్ కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. టివిఎస్ అనేది దేశ ప్రగతిలో రెండు చక్రాలన్నారు. మన దేశం మన బండి అన్నట్టుగా ప్రతి అవసరానికి ఎక్సెల్ మోపెట్ట దగ్గర నుంచి హెవీ వెహికల్ వరకు మోటార్ సైకిల్ నుంచి అపాచీ వెహికల్ 310 సిరీస్ వరకు కొత్త కొత్త వెహికల్స్‌తో కస్టమర్లకు ఎప్పుడూ అందుబాటులో ఉండే విధంగా ధర పరంగా, మెయింటెనెన్స్ పరంగా మంచి మైలేజ్‌తో ఎప్పటికప్పుడు కొత్తగా మోడల్స్ వస్తున్నాయన్నారు. ఏలూరులో ఉన్న ప్రతిఒక్కరూ షోరూమ్‌ని విజిట్ చేసి టెస్ట్ డ్రైవ్ చేయవచ్చన్నారు. సర్వీస్ కూడా ప్రీమియం సర్వీస్ ఉంటుందని, సర్వీస్ కోసం కస్టమర్ ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని, ఏలూరులో నెంబర్ వన్ పొజిషన్‌కి వెళ్లడానికి సర్వీస్‌లో గాని సేల్స్‌లో గాని కస్టమర్ కి అందుబాటులో ఉండడానికి టివిఎస్ కంపెనీ వారు చేసే కృషిలో వారు భాగం అవడం సంతోషంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న కులదీప్‌శర్మ, శివ భరద్వాజ్

అవగాహనలేమితోనే తలసేమియా కేసుల పెరుగుదల

వైద్యుల సలహాతో పరీక్షలు చేయించుకోవాలి

చిన్నపిల్లల వైద్య నిపుణురాలు వీణ అక్కినేని

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తల సేమియా భవనంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ విజయవాడ వారిచే తలసేమియా వ్యాధిపై బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల వైద్య నిపుణురాలు, కన్సల్టెంట్ పీడియాట్రిక్ హేమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ వీణ అక్కినేని మాట్లాడుతూ దేశంలో తలసేమియా కేసులు పెరగడానికి ముఖ్య కారణం ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడమేనని, ఆరు నెలల నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నట్లయితే వైద్యుల సలహాతో తలసేమియా, హిమోఫిలియా వంటి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. తలసేమియా వ్యాధి పిల్లలకు బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ పరిష్కారం ఉన్నప్పటికీ మ్యాచింగ్ దాత దొరకాలని, ఇది ఖర్చుతో కూడుకున్నప్పటికీ స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం సహకారంతో చేస్తున్నామని చెప్పారు. అనంతరం తల సేమియా చిన్నారులను పరీక్షించి, మందులను సూచించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది సుమారు పదివేల మంది తలసేమియా మేజర్‌తో పుడుతున్నారని, అలాంటివారు జీవితాంతం నిరంతర రక్తమార్పిడి, మందులను వాడాల్సిందేనని చెప్పారు. తలసేమియా చిన్నారులకు రెడ్ క్రాస్ సొసైటీ అండగా ఉంటుందని కృష్ణారెడ్డి అన్నారు. తలసేమియా స్క్రీనింగ్ క్యాంపునకు హాజరైన తలసేమియా చిన్నారులకు వారి తల్లిదండ్రులకు 150 మందికి భోజనాన్ని ఏర్పాటు చేసిన మానవత విద్యా నిధి కమిటీ ఛైర్మెన్ ఆలపాటి నాగేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు జెవి.ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ స్పందన, మానవత విద్యానిధి కమిటీ ఛైర్మన్ అలపాటి నాగేశ్వరరావు, ఆలపాటి వెంకట లక్ష్మీప్రసన్న, లావేటి శ్రీను, పిఆర్‌ఒ కెవి.రమణ, విజయవాడ రెయిన్ బో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వక్తలు

కాటన్ సేవలు చిరస్మరణీయం

జయంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - భీమడోలు

ఉభయగోదావరి జిల్లాలు సస్యశ్యామలంగా ఉండటానికి కారణమైన ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించిన సర్ అర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని, రానున్న తరాలు సైతం ఇదే ఒరవడి కొనసాగిస్తాయని జల వనరుల శాఖ, గుండుగొలను నీటి పారుదల శాఖ కార్యాలయ పర్యవేక్షకులు ఆర్.సత్యనారాయణ అన్నారు. గుండుగొలను కార్యాలయం వద్ద కార్యాలయ సిబ్బంది, లస్కర్లు, రైతులు భాగస్వామ్యంతో కాటన్ జయంతి పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిలా విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భం గా ధవలేశ్వరం ఆనకట్టతో పాటు, కృష్ణా నది ఆనకట్ట నిర్మాణం, విశాఖ పోర్టు నిర్మాణానికి ఆయన అందించిన సేవల గురించి వక్తలు వివరించారు. ఆయన చేసిన కృషి ఫలితంగానే ఏలూరు కాలువ ద్వారా గోదావరి-కృష్ణా జలాల అనుసంధానం, కాకినాడ నుంచి అప్పటి మద్రాస్ వరకు జల రవాణా సేవలు అందుబాటులో వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ యూనియన్ నాయకులు బాబూరావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



కాటర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

నూజివీడులోనే అత్యధిక శాతం పోలింగ్

ప్రజాశక్తి - ముసునూరు

ఏలూరు జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిని పరిశీలిస్తే నూజివీడు నియోజకవర్గంలోనే అత్యధిక శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. నూజివీడు నియోజకవర్గంలో 2,38,981 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,10,155 మంది ఓట్లు వేయగా 87. 94 శాతం పోలింగ్ నమోదైంది. వారిలో 1,18,104 మంది పురుషులకు 1,05,054 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 1,20,867 మంది మహిళలకు 1,05,102 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా పరిధిలోని ఉంగుటూరు నియోజకవర్గంలో 2,06,437 ఓట్లకు 1,81,152 ఓట్లు పోలయ్యి 87.75 పోలింగ్ శాతం నమోదైంది. దెందులూరు నియోజకవర్గంలో 2,24,13వేల ఓటర్లకు 1,92,901 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా 86.11 పోలింగ్ శాతం నమోదైంది. ఏలూరు నియోజకవర్గంలో 2,35,345 మంది ఓటర్లకు 1,65,132 మంది మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా 70.17 పోలింగ్ శాతం నమోదైంది. పోలవరం నియోజకవర్గంలో 2,53,981 మంది ఓటర్లకు 2,18,297 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 85.95 పోలింగ్ శాతం నమోదైంది. చింతలపూడి నియోజకవర్గంలో 2,73,069 మంది ఓటర్లు ఉండగా 2,22,932 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81.64 పోలింగ్ శాతం నమోదైంది. కైకలూరు నియోజకవర్గంలో 2,05,604 మంది ఓటర్లకు 1,79,536 మంది ఓటు హక్కును వినియోగించుకోగా పోలింగ్ 87.32 శాతంగా నమోదైంది. దీంతో అత్యధికంగా నూజివీడు నియోజకవర్గంలో 2,38,981 మంది ఓటర్లకు 2,10,161 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా పోలింగ్ 87.94 శాతంగా నమోదైంది. అధికారిక గణాంకాల ప్రకారం ఏలూరు జిల్లా పరిధిలో నూజివీడు నియోజకవర్గంలో అత్యధికంగా 87.94 శాతం ఓట్లు పోలయ్యాయని అధికారులు తెలిపారు.

దెందులూరులో 86.11 శాతం పోలింగ్

ఏలూరు టౌన్ :దెందులూరు నియోజక వర్గంలో 2,24,13,000 ఓటర్లు ఉండగా వారిలో 1,92,901 మంది ఓట్లు వేశారు. 86.11 శాతం పోలింగ్ నమోదైంది. 1,08,915 మంది పరుషులకు 95,410 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 1,15,089 మంది మహిళలకు 97,536 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అవగాహనా ర్యాలీ

డెంగీపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ముసునూరు

డెంగీ జ్వరాలు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నూజివీడు పిహెచ్‌సి సబ్ యూనిట్ అధికారి ఎం.యలమంద తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం నూజివీడు పట్టణ కేంద్రంలో డెంగీ వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహనా కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. పట్టణ కేంద్రాలతో పాటు మండల కేంద్రంలో, గ్రామాల్లో కూడా డెంగీ వ్యాధి లక్షణాలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పిహెచ్‌సి సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో చిన్నారులు

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని సామాజిక కార్యకర్త మండే సుధాకర్ కోరారు. శాఖా గ్రంథాలయంలో బుధవారం కొనసాగిన కార్యక్రమాల్లో మండే సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. వాటిపై సమీక్ష చేసే విధానాన్ని వివరించారు. నీతి కథలు బోధించారు. ఇదే క్రమంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో తాగునీరు, సాగునీటి సమస్యలను పరిష్కరించి ఆ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చిన కాటన్ సేవలు, జీవిత విశేషాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు కె.శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో విద్యార్థులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

చిన్నమలంలో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - పెనుగొండ


మనిష (ఫైల్‌ఫొటో)

మండలంలోని చిన్నమలం గ్రామం ఎస్‌సి కాలనీలో చోడగిరి మనిష (29) ఇంటి దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చినమాలం గ్రామానికి చోడగిరి హరికృష్ణ, మనీష దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ క్రమంలో దంపతులిద్దరు పిల్లలతో కలిసి బుధవారం ఉదయం పేరుపాలెం బీచ్ వెళ్దామనుకున్నారు. అయితే హరికృష్ణ బయటకు వెళ్లి ఆలస్యంగా వచ్చి బీచ్‌కు వెళ్దామని భార్యకు చెప్పాడు. దీంతో ఆలస్యమైందని, తాను బీచ్‌కు రానని మనిష చెప్పింది. దీంతో కుమార్తెలిద్దరితో కలిసి హరికృష్ణ బీచ్‌కు బయలుదేరాడు. దీంతో మనస్తాపానికి గురైన మనిష ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన స్థానికులు హరికృష్ణకు ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో హరికృష్ణ పిల్లలతో కలిసి హుటాహుటిన ఇంటి వచ్చాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ఏరియా ఆసుపత్రి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ షేక్ సుభాని తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి
ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులో బుధవారం కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, కోడిపుంజు, కోడికత్తి స్వాధీనం చేసుకున్నారు. జీలుగుమిల్లి హెడ్ కానిస్టేబుల్ టి.రాధాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లి మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు జీలుగుమిల్లి పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,950 నగదు, ఒక కోడి పుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అధ్వానంగా రోడ్లు... ప్రయాణికుల పాట్లు

ఏజెన్సీ గ్రామాల్లో పరిస్థితి
ఇబ్బందుల్లో గిరిజనులు
పట్టించుకోని అధికారులు, పాలకులు

రాళ్లు పైకి లేచి అధ్వానంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండడంలో ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో కనీసం అంబులెన్స్ వెళ్లలేని విధంగా రోడ్లు ఉన్నాయి. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీలిచ్చి మభ్య పెట్టి గెలిచాక అసలు పట్టించుకోవడంలేదని, కన్నెత్తిచూడడంలేదని గిరిజనులు వాపోతున్నారు. పాలకులు, అధికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి... పాలకులు మారుతున్నారు కాని ఏజెన్సీ గ్రామాల్లో రహదారులు మాత్రం అభివృద్ధికి నోచుకోవడంలేదు. అధ్వానంగానే ఉంటున్నాయి. ఎన్నికలకు ముందు పాలకులు ఇచ్చిన హామీలు గెలిచాక అమలుకు నోచుకోవడంలేదు. మాటలకే పరిమితమవుతున్నాయి. దీంతో పాలకుల తీరుపై గిరిజనుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. మండలంలోని గిరిజన గ్రామాలైన పండువారిగూడెం, దాట్లవారిగూడెం, వంకవారిగూడెం, జిల్లేళ్లగూడెం, రాచన్నగూడెం, తాటిరామన్నగూడెం, గంగన్న గూడెం, పి.రాజవరం, అంకన్నగూడెం, తదితర గిరిజన గ్రామాల్లో తరతరాలుగా ప్రజలు నివాసాలు ఉంటున్నప్పటికి ఆయా గ్రామాల్లోకి వెళ్లాలంటే రహదారులు అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహ దారుల గుండా ప్రయాణించాలంటేనే బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఏదైనా ప్రమాదం జరిగినా, లేక గర్భిణులు అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. రహదారుల గుండా ప్రయాణాలు చేసే సమయంలో ప్రమాదాల బారిన పడి ఎంతోమంది ఆసుపత్రి పాలయ్యారు. కొన్ని గ్రామాల్లో అయితే అత్యవసర కేసుల సమయాల్లో వచ్చే అంబులెన్స్‌లు కూడా రాలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్లు నిర్మించాలని, కనీసం మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు.

గుంతలతో అధ్వానంగా ఉన్న రహదారి


ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

మరమ్మతులు కూడా చేయలేదు

మడకం శేషగిరి, దాట్లవారిగూడెం

మా గ్రామల గుండా పూర్వం ఎప్పుడో నాసిరకంగా రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఆ రహదారులు కాస్త కొన్ని సంవత్సరాల్లోనే వర్షాలకు రాళ్లు పైకి లేచిపోయి రహదారులు అధ్వానంగా మారాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్ని ప్రభుత్వాలు మారిన రోడ్డు నిర్మాణం కాదు కదా మరమ్మతులు కూడా చేయలేదు.

రాళ్లపైనే ప్రయాణిస్తున్నాం

నాగదుర్గ, గిరిజన సంఘం మహిళ నాయకురాలు

మండలంలోని చాలా గిరిజన గ్రామాల్లో సరైన రహదారులు లేక ప్రయాణాలు చేసేటప్పుడు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు కాని ఆయా గ్రామాలకు సరైన రహదారులు వేసిన దాఖలాలు లేవు. ఇప్పటికీ రాళ్ల పైనే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

శ్రీను, పీసా కమిటీ సభ్యులు

ఎన్నికలకు ముందు నాయకులు మా గ్రామాలకు వచ్చి మీ సమస్యలు పరిష్కరిస్తాం. మీ ఓట్లు మాకేయండి అంటూ మభ్య పెట్టి వెళ్తున్నారు. తీరా గెలిచాక మళ్లీ మా గ్రామాల వైపు చూడట్లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే విధంగా రహదారులు తయారయ్యాయి.

అంగన్‌వాడీ కేంద్రం... సదుపాయాలు శూన్యం

వీరిశెట్టిగూడెంలో సెంటర్ దుస్థితి
ఇబ్బందుల్లో చిన్నారులు
పట్టించుకోని అధికారులు

అంగన్‌వాడీ కేంద్రం

ప్రజాశక్తి - కామవరపుకోట

అది ఒక సుమారు 70 శాతం ఎస్‌టి చిన్నారులు ఉన్న అంగన్వాడీ కేంద్రం. భవనం వద్ద ఎక్కడా కూడా ఒక శంకుస్థాపన, ప్రారంభోత్సవం ఫలకాలు కాని, కనీసం భవనంపై ఇది ఫలానా ప్రభుత్వ శాఖ భవనం అని తెలియజేసే బోర్డు ఎక్కడ లేదు. గుమ్మంపైన గోడపై పెన్నుతో మాత్రం అంగన్‌వాడీ కేంద్రం అని రాసి ఉంది. అది కూడా పరీక్షగా చూస్తేనే కనిపిస్తుంది. అది కూడా ఈ మధ్య కాలంలోనే రాశారు. లోపలకి వెళ్లి చూసే వరకు అది ప్రభుత్వ భవనమా, ఇల్లా అని తెలియని పరిస్థితి. కామవరపుకోట మండలం వీరిశెట్టిగుడెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో కనీస సదుపాయాలు కూడా లేవు. సుమారు మూడేళ్లుగా ఆ భవనంలో అంగన్‌వాడీ సెంటర్ నిర్వహిస్తున్నారు. కాని చిన్న పిల్లలకి కావాల్సిన కనీస సదుపాయాలు కల్పించలేదు. దీని గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వీరిశెట్టిగూడెం గ్రామ సచివాలయంలో కూత వేటు దూరంలో ఉన్న ఈ సెంటర్‌కి కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. దీంతో వేసవిలో చిన్నారులు డిహైడ్రేషన్‌తో అనారోగ్యానికి గురవు తున్నారు. ఎండ వేడికి ఉక్కపోతతో వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ భవనం తరవాత నిర్మించిన అన్ని ప్రభుత్వ భవనాలకు విద్యుత్ సౌకర్యం ఉంది. అంగన్‌వాడీ కేంద్రంలో కనీసం ఒక్క మరుగుదొడ్డి కూడా లేని పరిస్థితి. ఇంకా తాగునీటి సదుపాయం గురించి అయితే చెప్పనవసరం లేదు. చివరికి అంగన్‌వాడీ కేంద్రం లోపలికి వెళ్లడానికి డ్రెయినేజీ దాటాలి. ఆ డ్రెయినేజీ దాటేందుకు దానిపై ఏమీ ఏర్పాటు చేయలేదు. ఒక గడ్డ కట్టిన సిమెంట్ బస్తాను మాత్రం డ్రెయినేజీపై వేశారు. దాని మీద నుంచి చిన్నారులు నడిచే సమయంలో కాలు జారి పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇన్ని సమస్యలు ఉండడం వల్ల గ్రామంలోని తల్లితండ్రులు ఎవరూ కూడా తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపించడానికి ఇష్టపడడంలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతుంది. దీనిపై ఐసిడిఎస్ అధికారులను వివరణ కోరగా ఈ సెంటర్ ఎంపియుపి స్కూల్ ఆవరణలో ఉందని, ఈ సెంటర్‌కి సంబంధించిన పనులు విద్య శాఖ ద్వారా చేయాల్సి ఉందని చెప్పారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ కేంద్రానికి కావాల్సిన కనీస మౌలిక వసతులు కల్పించాలని చిన్నారుల తల్లితండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఏలూరు.. రసవత్తర పోరు

గతం కన్నా పెరిగిన పోలింగ్ శాతం
ఎవరికి వారు తమకే అనుకూలమంటున్న వైనం
వైసిపి, టిడిపి మధ్య ప్రధాన పోటీ
గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ నెల 13న సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 2019 ఎన్నికల్లో 68.39 శాతం పోలింగ్ నమోదవగా ఈ ఎన్నికలకు 71.02 శాతం పోలింగ్ నమోదైంది. గతంతో పోలిస్తే మూడు శాతం పోలింగ్ పెరగటంపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. పెరిగిన పోలింగ్ శాతం తమకు అనుకూలమంటే తమకే అనుకూలమంటూ ముఖ్య పోటీదారులైన వైసిపి, టిడిపిలు ప్రచారం చేసుకుంటున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకత వల్లే ఆ ప్రభుత్వాన్ని గద్దె దించటానికి ఓటర్లు ఎక్కువగా ముందుకు వచ్చారని, అది తమ పార్టీకి అనుకూలమని టిడిపి నాయకులు ఒకపక్క ప్రచారం చేసుకుంటూ ఉండగా అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలు ఎక్కువగా ఓట్లు వేశారని, అందువల్లే పోలింగ్ శాతం పెరిగిందని, అది తమ పార్టీకి అనుకూలమని వైసిపి ప్రచారం చేసుకుంటుంది. ఎన్నికల సందర్భంగా ఓటర్లకు డబ్బులు పంపిన విషయంలో తెలుగుదేశం పార్టీ ఎలాంటి అల్లర్లు లేకుండా పని పూర్తి చేసుకోగలిగింది. అయితే ఎన్నికల ముందు రెండు రోజులు వైసిపి డబ్బులు పంపిణీ సరిగా చేయలేదని, ఏలూరు అసెంబ్లీ పరిధిలో అల్లరి జరిగింది. ఎప్పుడూ బయటకు రాని ఉన్నత తరగతులకు చెందిన ఓటర్లు కూడా ఈసారి బయటకు వచ్చి ఓటేశారు. ఈ అత్యధిక ఓటింగ్ ఎటువైపు అనుకూలంగా ఉంటుందో ఎవరు గెలుస్తారో వచ్చేనెల నాలుగో తేదీ వరకు వేచి చూడాల్సిందే.

తాటి ముంజులకు గిరాకీ

ప్రజాశక్తి - కాళ్ల

తాటి ముంజులు విక్రయిస్తున్న వ్యక్తి

వేసవి రాకతో భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే వేసవిలో మాత్రమే లభించే తాటి ముంజులను కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. వేడి వాతావరణంలో తాటి ముంజులు ఉపశమనం కలిగిస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. శరీరంలో లవణాలు, పోషకాలను పోనీయకుండా వేసవి తాపం నుంచి తాటి ముంజులు ఉపశమనం కలిగిస్తాయంటున్నారు. దీంతో వీటికి గిరాకీ పెరిగింది. వేసవిలో ఏప్రిల్, మే నెలల్లో ఈ వ్యాపారం జోరుగా సాగుతుంది.

ఇక ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్న ఈ తాటి ముంజులు తినడానికి చాలా మంది ఇష్టపడుతుంటారు. వాటిని ఎంతో మంది ఇష్టంగా తింటారు. అయితే డయాబెటీస్ ఉన్నవారు తాటి ముంజులు తినొచ్చా లేదా అని ఆలోచిస్తుంటారు. మండలంలోని పలు ప్రధాన గ్రామాల కూడలితో పాటు పలు గ్రామాల్లో కొంతమంది ప్రజలు తాటి ముంజులు జీవనోపాధి పొందుతున్నారు.

ఏలూరుపాడు, జువ్వలపాలెం, దొడ్డనపూడి, కాళ్ల, సీసలి, జక్కరం, పెదఅమిరం గ్రామాల్లో తాటి ముంజుల వ్యాపారం జోరుగా సాగుతోంది. తాటి ముంజులు డజను 50 రూపాయలకు విక్రయిస్తున్నారు. వాటిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల కాల్షియం, ఫైటో న్యూట్రియెంట్స్, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు వైద్యులు. తాటి ముంజులను సమ్మర్‌లో తినడం వల్ల డీహైడ్రేషన్ సమస్యల నుంచి బయటపడొచ్చు. వికారం, వాంతులు వంటి లక్షణాల నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది. అంతేకాకుండా డయాబెటీస్ రోగులకు కూడా ఇది మంచి చేస్తుంది.

ప్రకృతివరం తాటిముంజులు..

వేసవిలో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు తాటి ముంజలు ఎంతగానో ఉపయోగపడతాయి. తాటిముంజు మనిషికి ఎంతగానో మేలు చేస్తుంది. మనిషి శరీరంలోని ఉష్ణోగ్రత తగ్గి జీర్ణక్రియ బాగా జరుగుతుంది. శరీరానికి మంచి చల్లదనాన్ని అందిస్తుంది. చిన్నారులకు, పెద్దలకు, సుగర్ వ్యాధిగ్రస్తులకు, స్థూలకాయులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆరోగ్యానికి దోహదం చేయడంతో పాటు దాహార్తికి కూడా మంచి విరుగుడు, తాటిముంజులో ఎక్కువ మొత్తంలో శరీరానికి కావాల్సి శక్తినిస్తుంది.

తమిళనాడు ఎంపీ సెల్వరాజ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - టి.నరసాపురం

సిపిఎం నేత, తమిళనాడులోని నాగపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన సెల్వరాజ్ మృతికి ఎఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షులు టివిఎస్.రాజు, ఉపాధ్యక్షుడు కొండముచ్చు శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తమ సంతాపాన్ని తెలిపారు. సెల్వరాజ్ పార్లమెంటులో తనదైన శైలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేవారన్నారు. సుదీర్ఘకాలం పార్లమెంటులోనూ బయట ప్రజాసేవకే తన యావత్ జీవితాన్ని అంకితం చేశారన్నారు. మూత్రపిండాల వ్యాధితో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారని చెప్పారు. సెల్వరాజ్ మృతికి మక్కినవారిగూడెం ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మల్లెల సత్యనారాయణ, సుబ్బారావు, సతీష్, ఎఆర్.పాలెం భూ పోరాట సమితి నాయకులు గదుల సత్యనారాయణ, శెట్టి నాగబాలాజీ, పెద్దిరాజు, నల్లమోతుల శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.

సికిల్ సెల్ ఎనీమియా రక్త నమూనాల సేకరణ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో సికిల్ సెల్ ఎనీమియా రక్త నమూనాల సేకరణ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. పోలవరం మండలంలోని వింజరం, ఎల్ఎన్‌డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎల్ఎన్‌డిపేట, గూటాల, పట్టిసీమ, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోట పంచాయతీల్లో నిర్వహించారు. జన్యుపరమైన లోపం వల్ల వచ్చే రక్త హీనత వల్ల రక్తంలో ఆక్సిజన్ కొరత ఏర్పడడంతో రక్త నాళాల్లో రక్తం గడ్డ కడుతుందని, దీంతో ఎముకల నొప్పి ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు తెలిపారు. మండలంలో సికిల్ సెల్ ఎనీమియా కేసులు గుర్తించి తగు వైద్య సేవలందించేందుకు సికిల్ సెల్ ఎనీమియా రక్త నమూనాల సేకరణ నిర్వహిస్తున్నట్లు వింజరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి మురళీధర్ తెలిపారు. మండలంలోని వింజరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో 122 రక్త నమూనాలు సేకరించి నట్లు ఎంపిహెచ్ఇఒ సోమరాజు, ఎల్ఎన్‌డిపేట, వింజరం పరిధిలో ప్రగడపల్లి, చేగొండపల్లి గ్రామాల్లో 30 రక్త నమూనాలు సేకరించినట్లు ఎంపిహెచ్ఎఒ జె.ప్రసాద్ తెలిపారు.

'టిడిపి శ్రేణులు సంయపానం పాటించాలి'

ప్రజాశక్తి - కామవరపుకోట

ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో ఉత్సాహంతో పని చేసి గెలుపుపై పూర్తి విశ్వాసంతో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు అదే ఆత్మవిశ్వాసంతో జూన్ నాలుగో తేదీన జరిగే కౌంటింగ్ వరకు సంయమనంతో ఉండాలని, ఆరోజు విజయోత్సవం జరుపుకుందామని టిడిపి కామవరపుకోట మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగో తేదీ వరకు ఎదుటివారు ఎటువంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా రెచ్చిపో కూడదన్నారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మరో రూపమని, జూన్ 4వరకు అదే క్రమశిక్షణ పాటించాలని చెప్పారు. మన వైపు నుంచి ఎటువంటి రెచ్చగొట్టే మెసేజ్‌లు చేయవద్దని, కవ్వింపు చర్యలు చేయవద్దని చెప్పారు.

కార్యకర్తలకు అండగా ఉంటా
కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - చాట్రాయి

టిడిపి కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఆ పార్టీ నూజివీడు ఎంఎల్‌ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తల, నాయకుల సమావేశం జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి నివాసంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపించడం కోసం రాత్రి పగలు కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. చాట్రాయి మండలంలో టిడిపికి బూరుగుగూడెం, పర్వతాపురం, పోతనపల్లి గ్రామాల్లో పట్టులేదని, ఓటింగ్ శాతం లేదని చెప్పారు. కాని ఆ గ్రామాలలో ఓటింగ్ శాతం ఎక్కువ వచ్చిందని తన దృష్టికి వచ్చిందన్నారు. ఎక్కువ రావడానికి కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకొస్తుందని, కార్యకర్తలకు ఏ అవసరమొచ్చినా అందుబాటులో ఉండి కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తానని, వారికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మరిడి వెంకటేశ్వరరావు, బొట్టు లక్ష్మణరావు, నోబుల్ రెడ్డి, బొట్టు రామచంద్రరావు, చల్లగుల్ల రాజారత్నం, కంచర్ల హనుమంతరావు, కోట జోషి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

'టిడిపి కూటమిదే విజయం'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అసమర్థ ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రజలు తీసుకున్న నిర్ణయానికి పోలింగ్ శాతం పెరగడమే నిదర్శనమని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు అన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాసరావు ఇంటి వద్ద టిడిపి కూటమి నాయకులు బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రంలో అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసిందన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ టిడిపి కూటమిని విజయం సాధిస్తుందని, అందుకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన ఉభయగోదావరి జిల్లాల కార్యదర్శి చోడి పిండి సుబ్రహ్మణ్యం, టిడిపి మండలాధ్యక్షుడు పారేపల్లి నరేష్, టిడిపి పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణారావు పాల్గొన్నారు.